



# సింహబలుడు

కళ్ళు జిగాలుమన్నై. భుజం మీద వున్న తుండుగుడ్డతో, గట్టిగా ఓమారు కళ్ళు తుడుచుకుని 'అవునా? కాదా?' అనే సంశయంతో, మరోసారి ఆ మేడ వేపుకు చూశాడు సత్యం నిదానంగా, జాగర్తగా....

సూర్యుడు టవర్‌క్లాక్ వెనక్కి పోయాడు. మేడ కిటికీలకు బిగించివున్న రంగురంగుల అద్దాల కాంతులు, ఆకుపచ్చ, ఎరుపు, పసుపు – అవన్నీ వారం రోజుల నుంచీ తను చూస్తున్నవే! కాని యివ్వాళ తన కళ్ళని మిరుమిట్లు కొలిపి, హృదయానికి చక్కిలిగింత పెట్టిన నీలం –

కిటికీ చువ్వలకి బాగా తల ఆనించి, తన వేపుకే, నిజంగా తననే ఓ యువతి చూస్తోంది. ఆమె కట్టుకున్న నీలిరంగు చీర నుంచి వచ్చే కాంతి, పక్కనవున్న వివిధ రంగుల కిటికీ అద్దాల కాంతుల్తో పోటీ పడుతోంది.

సత్యానికి సంశయనివృత్తి కలిగింది. ఆమె తన వంకకే చూస్తోంది. చుట్టూ తను వున్న డాబాలో సమానమైన ఎత్తులో వున్న యిళ్ళ వైపుకు చూశాడు. తనుకాక, ఆ యువతి అక్కడ వుండి చూస్తే కనబడేందుకు ఎవరైనా ఉన్నారా అని. ఉహుఁ! ఎవరూ లేరు.

ముప్ఫై ఆరంగుళాల అతని ఛాతీ, దమ్ము పట్టకుండానే యింకో రెండంగుళాలు పెరిగింది. తన నిండు మీసాన్ని కుడిచేత్తో దువ్వుకుంటూ ఆ వైపుకు ఓమారు జాగర్తగా చూసి, సన్నని ఓ

చిన్న యీలా, నాజుకైన ఓ చిన్న చిరునవ్వు విసిరాడు. ఆ యువతి ఫక్కున నవ్వి, కిటికీ చువ్వల్ని గట్టిగా కొట్టి, చేత్తో జడని పట్టుకుని, దాన్ని అతడి వైపుకు చర్నాకోలులా వూపింది.

తనకేదో మైమరపు కలుగుతూన్నట్టుగా, సత్యం గ్రహించాడు. ఎందుకైనా మంచిదని పిట్టగోడ మీద మీంచి దిగి ఆశతో, వుత్సాహంతో నిజమా అన్నట్టు అటే చూస్తున్నాడు.

ఆ యువతి అక్కడే ఆ కిటికీ దగ్గరే నుంచుని వుంది. జంకూ గొంకూ లేకండా నవ్వూ, చేతులు తిప్పడం – యింకా, అలాంటి అలాంటి సాంకేతికాలతో తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తోంది.

క్రమంగా వెలుగు తగ్గి పోతోంది. కిటికీ దగ్గిర వున్న ఆ యువతి కూడా క్రమక్రమంగా చీకటితో కలిసిపోతోంది. మొదట ఆమె ధరించిన నీలిచీర నల్లగా మారింది. తరవాత జుట్టూ, రవికె, ముఖం ఆఖరిసారిగా ధవళకాంతి కంటే కూడా ధవళంగా వున్న ఆమె పలు వరుసా – అంతా చీకటి.

సత్యం అక్కడే ఆ పిట్టగోడ నానుకుని అలాగే నుంచున్నాడు. చుట్టూ చీకటి మయం. తను ఆ రాత్రికి ఆమెను యిక చూడగలననే ఆశ కూడా లేదు. కాని ఏదో ఆశలకు అతీతమైన ఆశ, వుత్సాహం, అన్ని నరాల్లో, నాళాల్లో వెచ్చగా ప్రవహించే కోర్కెల, వూహల స్పందనలు అతణ్ని అక్కడ నిలిపినై.

టవర్ క్లాక్ తొమ్మిది గంటలు కొట్టింది. సత్యం క్రిందకు దిగుదామని వెనక్కి తిరిగాడు. గట్టిగా కాలుకు తగిలి 'మ్యావ్' అంటూ ఓ పిల్లి పిట్టగోడ మీది నుంచి అమాంతం అవతలి డాబా మీదికి దూకేసింది.

'మనుషుల కంటే పిల్లులూ, గుడ్లగూబలే అదృష్టంగలవి. అవి రాత్రివేళ కూడా బాగా చూడగలవ్' అనుకుంటూ కిందికి దిగాడు సత్యం.

లాంతరు వెలిగించి దూరంగా పిట్టగోడకు చేరగిలాపడి కూర్చున్నాడు. అతని మనోవీధిలో జరిగిపోయిన వివిధ సంఘటనలు కదుల్లాడినై.

తనను పూర్తిగా కవ్వించి, కాలుదువ్వి తీరా తను కార్యరంగంలోకి దిగబోయేసరికి అందకుండా తప్పించుకు పోయిన వాళ్ళు ఎంతమంది? 'ఎంతమంది?' – సత్యం యీ ప్రశ్నని బిగ్గరగా తన ఎదురుగా వున్న మసక లాంతర్నీ, చుట్టూ వున్న గోడల్నీ కలిపి అడిగాడు.

నిజం చెప్పాలంటే అసలు అబద్ధం చెప్పవలసిన అవసరం తనకు లేదు. యిది నాలుగోది. యిదివరకు మూడు పరీక్షల్లో ఓడిపోయాడు. కాని యీ నాలుగో....

అసలు తనకు ఏ కారణంచేత ఆ ఓటములు సంభవించినై? అంతదూరం తమకు తామై రెచ్చకొట్టిన ఆ ముగ్గురు యువతులు ఆఖరు క్షణాల్లో ఎందుకని నిరాకరించారు?

కాంతం అన్నది – "నీకు విశాల హృదయం లేదు" అని. తను ఏమని జవాబిచ్చాడు, "నా ఛాతీ ముప్ఫైఆరు అంగుళాలు. అది కూడా విశాలం కాదంటే ఏమనుకోవాలి?" ఆ మాటతో కాంతం, లక్ష్మి యింకా రాధ అంతా నవ్వారు. అప్పుడు వాళ్ళు నవ్విన కారణం తనకు తెలీలా. కాని యీ మధ్య తెలుసుకున్నాడు. ఛాతీ వేరూ, హృదయం వేరని. తరవాత తన అజ్ఞానానికి

ఎంత బాధ పడ్డాడు!

తను బెజవాడలో ఉండగా హేమ కూడా యిలాగే ముందు రెచ్చకొట్టింది. కాని తీరా తను కదిలిస్తే - "నేను యింటర్ చదువుతున్నాను. నీవు థర్డు ఫారం. నాకు ముందు ఆ సంగతి తెలీదు. క్షమించాలి" అనేసింది. మరి కొన్నాళ్ళకి శకుంతల కూడా యిలాగే...

అసలు లోపం తనలో ఎక్కడుంది? తను ఎండమావుల్ని నీళ్ళనుకొని భ్రమిస్తున్నాడా? ఆ అనుమానం యిదివరకే తనకు కలిగింది. వెంకట్రావు నడిగితే - వాడు తన ప్రాణమిత్రులు నలుగురిలో ఒకడు -

"తను పుట్టిన వర్గంలో, ఆర్థికంగా ఒక మనిషి ఉన్న స్థాయి, అతడు చేసుకోబోయే పెళ్ళాన్నీ, స్వీకరించబోయే వృత్తినీ నిర్ణయిస్తాయి" అన్నాడు.

అయితే మెచ్చుకొని, వీపు తట్టి పదిహేడు జ్యువెల్సు రిస్టువాచీలని రిక్షారామన్నల చేతులకు కట్టే ధనిక స్త్రీల మాటేమిటి?

"అవి మధ్యతరగతి త్రిశంకుల వూహాగానాలు. అలాంటి స్త్రీలు వున్నా వాళ్లు కోటికి ఒకరు. అవన్నీ సీరియస్‌గా తీసుకోబోకు" - అంటాడు.

వెంకట్రావు తన ప్రాణమిత్రుడు. ఎప్పుడు ఏది అడిగినా యిలాగే వర్గాలనీ, ఆర్థికస్థితి అనీ పరస్పర సంఘర్షణ అనీ అంటాడు. అవేమీ తనకు అర్థం కావు. తనకు మాత్రం మానవుల్లో రెండే వర్గాలు కనబడతారు. తనలా ఐదున్నర అడుగుల్నించి ఆపైన ఎత్తు పెరిగిన వాళ్ళూ, ఐదు అంతకు లోపు ఎత్తు వాళ్ళు.

కాని, సత్యం కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. బాధగా 'హుం' అనుకున్నాడు - లేచి లాంతరు బాగా తగ్గించి -

'కాని - నాకన్న ఆ మరుగుజ్జులూ, పిడక కచ్చికలంత మందపు అద్దాల కళ్లజోళ్ళు పెట్టి నడుములు వంచుకుపోయి, బక్క పీనుగుల్లా వుండే వాళ్ళే అదృష్టవంతులు!'

తను ప్రేమించి తప్పకుండా వివాహం చేసుకోవాలనుకున్న పూర్ణ తన గుండెల్లో చిచ్చుపెట్టి భాస్కర్రావుని చేసుకుంది. అతడిలో ఏ అందాన్ని ఆమె చూసినట్టు? అవడానికి అతడు యీనాటికీ తన ప్రాణమిత్రుడు. అయినా ఆ వామనాకారం, వంద పౌనుల లోపు తూకం. గుడ్లగూబ లాంటి కళ్ళజోడు! చదువుకున్నాడు. బాగా వుపన్యాసాలిస్తాడు. లాఠీ దెబ్బలు తింటాడు. వెంకట్రావులాగా వర్గాలు, న్యాయం అనకపోయినా, దేశం! దేశం! అంటాడు, అంతే!

"శరీరాన్ని అయిదడుగుల తొమ్మిదంగుళాలు పెంచావ్. తూకం బహుశా నూట అరవై దాటించి వుంటావ్. ఇక యిప్పుడు మెదడుని పెంచే విషయం ఆలోచించు. బస్కీలూ, దండీలూ కొట్టడం తగ్గించి, చదవడం, ప్రపంచాన్ని గురించి తెలుసుకోవడం ప్రారంభించు"

అచ్చగా యివే మాటలు భాస్కర్రావు, పూర్ణ దగ్గర వుండగానే తనతో అన్నాడు. అప్పుడు ఆ మాటలు తనకు ఎంతో బాధ కలిగించినా, తరవాత జరిగిన రెండు ఆశాభంగాలతో అతడన్న మాటల్లో ఏమైనా సత్యం వుందా అనేది తనకు తట్టడం ప్రారంభించింది.

అయినా, వాళ్ళలాగా తనూ చదివీ, వుపన్యాసాలిచ్చీ ఏం పరిస్థితుల్ని బావుచేసుకోగలడు! వాళ్లు మాత్రం బాగా చదువుకున్న వాళ్ళనీ, అందమైన వాళ్ళనీ, పెళ్ళిళ్ళు మాత్రం చేసుకోగలిగారు. తరవాత వెంకట్రావు రాయవేలూరులో వున్నాడు. భాస్కర్రావు ఆరు నెల్ల నుంచి వుద్యోగం పోగొట్టుకొని తిరుగుతున్నాడు. చలమయ్య బొమికలన్నీ విరగకొట్టించుకుని 'నేను రాజకీయాల నుంచి విరమించుకున్నాను' అని పత్రికల్లో రాసుకున్నాడు. ఆ విధంగా వాళ్ళకన్న తనే నయం.

కప్పుకున్న దుప్పటిని రెండు కాళ్ళతో గట్టిగా అవతలికి తన్నేసి 'ఎట్లా నయం?' అంటూ సత్యం లేచి కూర్చున్నాడు. వాళ్ళందరికీ పెళ్ళిళ్ళు అయినై. నేను వాటికి యింత ఎడంగా వుండి బస్కీలూ, దండీలూ కొట్టి శరీరాన్ని యినుములా చేసుకున్నా యింత బలంగా, అందంగా వున్నా - ప్రతీ యువతీ తనను గురించి కొంచెం తెలుసుకోవడం ప్రారంభించేసరికి యిట్టే బెదిరి పారి పోతోంది. పురుషుల్లో వున్న బలాన్నీ, అందాన్నీ కాక స్త్రీలు యింకేం కోరుతారు. పృథ్వీరాజు సినిమాలో ఆలెగ్జాండరు వేషం వేసి క్లోజప్‌లో నడుం దగ్గిర నుంచి కింద కనబడుతూ, తెరమీద అటూ యిటూ నడుస్తూంటే, బాక్సుల్లో కూర్చున్న కొందరు స్త్రీలు మూర్ఛపోయారనీ, మరికొందరికి హిస్టీరియా వచ్చిందనీ తను పత్రికల్లో చదివాడు. మరి తన అందం, బలం మాత్రం -

బలాన్ని స్త్రీలు ప్రేమించరా? పురాణకాలంలో ఏం జరిగేది? అంతా స్వయంవరానికి కూర్చుంటే రాజకుమార్తే స్వయంగా వచ్చి వరించేది. అవును అన్నట్టు పక్కన చెలికత్తె వుండి చెప్తూండేది. 'వీడు అసహాయ శూరుడు! యీయన చలి పిడుగు! వీరు ఏనుగు తొండంలో బొటనవేలు దూర్చి అమాంతం ఎత్తి అవతల పారేస్తాడు!' యింకా - అలా - అంతే! రాజకుమార్తె తనకు కావలసిన వాణ్ని ఎన్నుకునేది. అంతేగాని 'వీడు ఆనర్సు ప్యాసయ్యాడు! యీయన రాగిరేకు శాసనాల్ని గురించి రాసి డాక్టరేటు సంపాయించాడు. వీడు గుడ్లగూబ కాదు, మనిషే! రోజుకు యిరవై అయిదు గంటలు చదువుతాడు. మాంచి విమర్శకుడు!' - యివేమీ వుండేవి కాదు. ఆనాడు స్త్రీలు బలాన్ని ఆరాధించేవాళ్ళు. కాని యీనాడు, తన బలాన్ని గుర్తించేదెవరు? థర్డ్ ఫారం తప్పాననీ, దున్నపోతు మహారాజనీ యింకా....బలాన్ని ఆరాధించే వాళ్ళు లేకపోయినా, కనీసం గౌరవించే వాళ్లు కూడా లేరు. ఆ మాత్రం జ్ఞానం ఎవరికైనా వుంటే, తనకు యీపాటికి మూడు పెళ్లిళ్లు కావలసింది. అదంతా గతం. యివ్వాళ దర్శనం యిచ్చిన యీ నాలుగో అమ్మాయి?

'బలాన్ని ప్రేమించే స్త్రీలే లేకుండా దేశం గొడ్డుపోయి వుండదు. యీ అమ్మాయి అలాంటిది అయివుండొచ్చు. లేకపోతే తనను ఏ మాత్రం ఎరిగి వుండకపోయినా, తన అందాన్నీ, బలాన్నీ చూసి కాకపోతే ఆ విధంగా అంత ధైర్యంగా చేయి ఎలా వూపగలుగుతుంది? ఏదో రేపు సాయంత్రానికి తేల్చేస్తాను!'

దుప్పటి కాళ్ళ క్రింద గట్టిగా తన్నిపట్టి సత్యం కలత నిద్దరలోకి జారాడు.

ఉదయం ఏడు గంటల వరకు చచ్చిన వాడి కంటే కూడా ప్రశాంతంగా తీరిగ్గా నిద్దరపొయ్యే అలవాటువున్న సత్యానికి ఆనాడు అయిదు గంటలకే మెలకువ వచ్చింది. శరీరం బద్ధకంగా వున్నా మనస్సు మాత్రం వుత్సాహంతో వుద్రేకంతో వురకలు తీస్తోంది. అనేకమైన ఆలోచనలూ,

అగణితమైన మధుర భావాలూ -

కాఫీ తాగి బయలుదేరాడు. 'ఇంతకీ ఆ అమ్మాయి వాళ్ల కుటుంబం మేడ క్రింది భాగంలో వుంటున్నారా? పై భాగంలో వుంటున్నారా?' - తేల్చుకోవాలి.

బజారు మూల తిరిగి ఆ మేడ వైపుకు నాలుగైదు గజాలు నడిచాడు. అతని హృదయం ముప్పిరిగొన్న ఆనందంతో పారవశ్యంతో వుక్కిరిబిక్కిరైపోయింది.

తలుపు మీద 'టులెట్' బోర్డు, తలుపు నానుకుని ఆ అమ్మాయి!

అదృష్టదేవత అనేక రూపాల్లో, అనేక భంగిమల్లో ప్రత్యక్షమౌతుంది. 'టులెట్' ఎవరు? ఏది? ఆలోచించడం అలవాటులేని సత్యంలో కూడా ఏదో ఆలోచనాశక్తి కదల ప్రారంభించింది.

స్వర్గసీమల్ని అధిగమించి పోయిన మనస్సుతో, అర్థతన్మయావస్థలో అతడు మెట్లు ఎక్కి ఆ అమ్మాయినీ, ఆ తలుపునీ సమీపించాడు.

"అద్దెకు యిస్తారా?" - అప్రయత్నంగా గాలిలో తేలిపోతూ ప్రశ్నించాడు.

ఆ అమ్మాయి కొంచెం తలుపు చాటుగా వెళ్లి నిండుదేహంతో నవ్వింది.

సత్యానికి అదృష్టదేవత గాడిద తన్ను తన్నినట్లయింది. అతడు ముందుకు పడబోయి తమాయించుకున్నాడు.

"గది అద్దెకు తీసుకుంటారా?" - ఓ ముసలి గొంతుక సత్యాన్ని వెనక నించి ప్రశ్నించింది.

మానవుడు ముందుకు దూకుతూంటే వెనక నుంచొని ప్రశ్నించే వాటినే పిశాచాలంటారు.

సత్యం గతుక్కుమన్నాడు. ఎక్కడిదీ వృద్ధ పిశాచం!

"అద్దె యిరవై అయిదు రూపాయలు. యిష్టం అయితే రేపు సాయంత్రం వచ్చి చేరొచ్చు"

అతడు టక టక చెప్పేస్తున్నాడు.

"అయితే నేను తీసుకుంటాను అడ్వాన్సు...." - సత్యం జేబులో చెయ్యి పెట్టాడు.

ఆ వృద్ధుడు సత్యం ముందుకు వచ్చి - "మీరిప్పుడేమీ అడ్వాన్సు యివ్వనవసరం లేదు. యీ దూరదేశంలో ఏ తెలుగువాడన్నా నాకు మాంచి గౌరవం. రేపు సాయంత్రం మీరు సామానంతా తెచ్చుకుని, గదిలో చేరిన తరవాత అన్నీ మాట్లాడుకుందాం" - అతడు సత్యం భుజం మీద చేయివేసి ఎంతో ఆప్యాయంగా అన్నాడు.

"సరే! శెలవు. రేపు సాయంత్రం వస్తాను"

నిజం చెప్పాలంటే, సత్యం చెప్పిన ఆ 'శెలవు' ఆ అమ్మాయికి, వృద్ధజీవానిక్కాదు.

సరిగా ఆఖరి మెట్టు దిగబోయే సమయానికి వృద్ధుడు, "యిదిగో! యిటు రండి! ఒక్కమాట" అని కేక వేశాడు.

సత్యంలో సంతోషం వెల్లివిరిసింది. మరోమారు ఆ అమ్మాయిని చూడవచ్చు! తనకు తెలియకుండానే ప్రతి ముసలాడు ఎవరో ఒక యువకుడికి పెళ్ళిళ్ళ పేరయ్య అవుతాడు అనుకున్నాడు.

"మీరు ఏం పని చేస్తుంటారు?"

"రైల్వే వర్కుషాపులో పని"

ఆ అమ్మాయి తలుపు పక్కన నిలబడి వింటూనే వుంది.

సత్యం ఒక కన్ను ఆ వైపుకు అద్దెకు వదిలేశాడు.

"భార్యా పిల్లలూ...."

"అసలు పెళ్ళే కాలేదు" – యీ ప్రశ్న ఆ అమ్మాయి ఎదటనే వేసినందుకు ముసలాడికి అద్దె మరో అయిదు రూపాయలు ఎక్కువ యిద్దామనుకున్నాడు.

"వయసు ముదిరిపోతోందనుకుంటాను" – వృద్ధుడు జాలిగా అన్నాడు.

"మీ దయ వలన....యీ సంవత్సరం...కాదు...యీ నెలలోనే..." – సత్యం ధైర్యంగా ఆ అమ్మాయి వైపుకు తలతిప్పి నవ్వాడు.

ఆమే నవ్వింది.

ముసలాడు నేల వంక చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. కొంచెం ఆగి తల పైకెత్తి, "మీరేం చదివారు?" అన్నాడు.

సత్యానికి కొబ్బరి బొండాం గొంతులో యిరుక్కున్నట్టయింది. పాపాత్ముడు! యింతకు ముందు ఎంత చక్కని ప్రశ్నలు వేశాడు. యీ పాడు ప్రశ్న వేయాలనే బుద్ధి అతడికెందుక్కలగాలి? తలుపు వంక చూశాడు. ఆ అమ్మాయి అక్కడే నిలబడి ఏదో ఆతృతగా తన వైపుకే చూస్తోంది. జవాబు చెప్పాలి తప్పదు – చెప్పాడు.

"థర్డ్ ఫారం! రేపు సాయంత్రం, సామాను తెచ్చుకుంటాను. శెలవు"

తలుపు పెద్ద శబ్దం చేస్తూ మూసుకుంది.

వృద్ధుడు, "రెండు రోజుల్లోపల మీ యిష్టం వచ్చినప్పుడు రండి" అన్నాడు.

సత్యం మెట్లు దిగుతూ తలుపు వంక చూశాడు. అక్కడ ఆ అమ్మాయి లేదు. తలుపు మూసి వుంది. బహుశా తన ప్రియురాలు తన రాక అంత త్వరలో జరగబోతోందని తెలుసుకుని, ఆనందంతో ఆ తలుపు వెనక మూర్ఛపోయి వుంటుంది. తన ప్రేమ కోసం ఆమె ఎంత బాధపడు తోంది!

❀ ❀ ❀

ఆ పగలల్లా సత్యం గాఢానంద తరంగాల మీద అలా అలా తేలిపోయాడు. రాత్రికి సామానంతా సర్దడం ప్రారంభించాడు. రేపటి సాయంత్రానికల్లా కొత్త గదిలో నివాసం.... యింకా....

గోడను తగిలించి వున్న వీర హనుమాన్ ఫోటో దించేటప్పుడు అతని హృదయం చలించింది! ఆ పక్కనే నిండు దేహంతో శారీరక బలానికి, సాహసానికి చిహ్నంగా కోడి రామ్మూర్తి!

సత్యం చేతులు వొణికినై. ఆ రెండు ఫోటోలు కిందకు దించి, ఒకదాని పక్కనే ఒకటి పెట్టి భక్తి భావంతో నమస్కరించాడు. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగినై.

"యిక ఎంతోకాలం యీ బ్రహ్మచారి జీవితాన్ని గడపలేను. దేహబలాన్ని తిండిపోతు లక్షణం కిందా అందుకు చేసే ప్రయత్నాన్ని సోమరితనం కిందా జమకట్టే యీ పాడు ప్రపంచంలో నేనేమీ చేయలేను. ఏదో కొత్త జీవితంలో ప్రవేశిస్తున్నాను. వివాహం..... బహుశా యీ నెలలోనే....మీ

దయా దీవనలూ!"

సత్యం భక్తి పురస్కరంగా, కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ యిద్దరికీ నమస్కరించాడు.

వీరహనుమాన్ కళ్ళు వురిమినట్టు కనబడ్డాడు.

కోడి రామ్మూర్తి కొంత చలించినట్లుంది. అవును! అతడు ఆధునీకుడు. ఆజన్మ బ్రహ్మచారిత్వంలో వున్న బాధా, వేదనా అతడికి కొంత తెలుసు.

ఆ రెండు ఫోటోలను గోడకు ఆనించి పెట్టి, "యివే మీకు నా ఆఖరి నమస్కారాలు!" అంటూ, ఓ వంద బస్కీలు కొట్టి ఆ రెంటినీ పెట్టెలో పెట్టేశాడు.

సాయంత్రం అయిదు గంటలకల్లా సామానంతా రెండు రిక్షాల్లోకి సర్ది కొత్త గదికి బయలుదేరాడు. తను, మేడ ముందుకు వెళ్ళేటప్పటికి అక్కడ రెండు రిక్షాలు సామానుతో ఆగి వున్నై.

వృద్ధుడు నవ్వుతూ ఆహ్వానించాడు.

"పాతవారు బయటికి వెళ్తూ వుండగానే కొత్తవారు లోపల ప్రవేశించడం మాంచి శుభసూచకం" అన్నాడు.

సత్యానికి ఏదో నల్లని చీకటి తెర ఒక క్షణకాలం అడ్డం పడినట్లయింది. బయటికి వెళ్తూన్నది ఎవరు?

సంశయంతో, అనుమానంతో అతడు రిక్షాలోనుంచి దిగి ఒక చిన్న పెట్టెను చేత్తో పట్టుకొని గది వైపుకు వెళ్లాడు.

గదిలోనుంచి ఓ నూతన వ్యక్తి వేగంగా బయటకు వస్తూ, "మీరు లోపలకు వెళ్ళొచ్చు. మా సామానంతా తీసేశాం. మా అమ్మాయి కూడా బయటకు వచ్చేస్తోంది" అన్నాడు.

సత్యం బరువెక్కుతున్న హృదయంతో అనుమానిస్తూ గదిలోకి రెండడుగులు వేశాడు.

మెరుపుతీగలాగా అతడి కళ్ళని జిగాలుమనిపించి పక్కన వేగంగాపోతూ, 'గుడ్ బై! మిస్టర్ థర్డ్ ఫారం!" అంటూ ఆ అమ్మాయి బయటికి వెళ్ళిపోయింది.

సత్యం చేతిలోని పెట్టె పెద్ద శబ్దంతో కిందపడిపోయింది. అవ్యక్తమైన బాధతో, అవయవాలన్నీ కుంచించుకుపోగా, ఉచ్ఛ్వాస నిశ్వాసరహితమైన అచేతనావస్థలో అతడు కుప్పలా కూలిపోయాడు. చిమ్మ చీకటిలో, అధోలోకాన్నుంచి అస్పష్టంగా ఏవో ధ్వనులు అతడి చెవుల్లో దారి వెతుక్కుంటున్నై.

"ఏమాత్రం అవకాశం వున్నా, అమ్మాయిని థర్డ్ ఇయర్ చదివేందుకు యిక్కడికే తీసుకురండి!"

"అదే చూస్తున్నాను. ఏమాత్రం వీలున్నా యిక్కడికే వస్తుంది. లేకపోతే బెజవాడ. యిక్కడికొస్తే మాత్రం, మళ్ళా మీ యిల్లూ, రూమూ...."

రెండు మగ గొంతుకలు శెలవు చెప్పుకుంటున్నై. ఆ అమ్మాయి నవ్వుతోంది.

సత్యం తనలో మిగిలివున్న కొద్దిపాటి చైతన్యాన్ని వుపయోగించి, రెండు చెవులూ గట్టిగా మూసుకుని, తలతో ఆ కటిక రాతినేలని బద్దలు కొట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు!

❋

*(రేరాణి మాసపత్రిక : ఏప్రిల్, 1949)*